
సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025

అమ్మవారి నేటి అలంకారము
శ్రీ గాయత్రీ దేవి





స్వర్ణకవచ అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు



బాలా త్రిపురసుందరీదేవిగా కన్యకాపరమేశ్వరి



కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



కోటవీధిలో ఏర్పాటు చేసిన భారీ దుర్గాదేవి విగ్రహం

- విశాఖలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ
- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

శక్తి స్వరూపిణీ.. శరణు శరణు

నవదుర్గల వైభవం.. ముల్లోకాలనూ పాలించే జగన్మాత ఆరాధనతో విశాఖ నగరం పులకించిపోయింది. శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా ప్రారంభమై నగరాన్ని ఆధ్యాత్మిక కాంతులతో నింపేశాయి. బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణ కవచ అలంకారంలో దివ్యతేజస్సుతో దర్శనమివ్వగా, పాతనగరంలో కన్యకాపరమేశ్వరి బాలాత్రిపురసుందరిగా భక్తులను కరుణించింది. ఇక్కడ జరిగిన కుంకుమ పూజల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడగా.. వీధివీధినా దుర్గాదేవి మండపాలు వెలిసి, శాస్త్రోక్తంగా జరుగుతున్న పూజలతో సాగరనగరం భక్తి సాగరంలో ఓలలాడుతోంది.

నేటి నుంచి సింహగిరిపై శరన్నవరాత్రి ఉత్సవాలు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం రామాయణ నవరాత్ర పారాయణం, సాయంత్రం సింహవల్లీ తాయారు, చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవార్లకు తిరువీధి నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఆలయంలో శ్రీరామాయణ నవరాత్ర పారాయణ పఠనం, అమ్మవార్లకు తిరువీధి ఉంటుందని ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తెలిపారు. ఈ నెల 27న సింహవల్లీ తాయారు సన్నిధిలో వీరలక్ష్మీ ఆరాధనం, 29న మూలానక్షత్రం పురస్కరించుకుని ఆయుధపూజ(మూల పూజలు) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 2న కొండదిగువ పూలతోటలో సాయంత్రం జమ్మివేట ఉత్సవం జరుగుతుందన్నారు. భక్తులంతా ఈ పూజల్లో పాల్గొని, తరించాల్సిందిగా కోరారు.

వైబ్ ఉంది బ్యూటీ.. వైబ్ ఉందిలే.!

గాజువాకలో రితికా సందడి



మిరాయ్ హీరోయిన్ రితికా నాయక్ సోమవారం గాజువాకలో సందడి చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఓ షోరూమ్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆమె అభిమానులతో ముచ్చటించి.. సెల్ఫీలు దిగారు. విశాఖ నగరం అంటే తనకు చాలా ఇష్టమని, ఇక్కడి ప్రజలు ఎంతో ప్రేమను చూపిస్తారన్నారు. మోడలింగ్ నుంచి సినిమాల్లోకి వచ్చానని, ప్రస్తుతం వరుణ్ తేజ్‌తో కలిసి ఓ సినిమాలో నటిస్తున్నట్లు రితికా వెల్లడించారు.

- గాజువాక

విద్యార్థులపై కర్కశం







విద్యార్థులను వ్యానుల్లో ఎక్కిస్తున్న పోలీసులు

- కలెక్టరేట్‌ను ముట్టడించిన ఏయూ విద్యార్థులు
- అడ్డుకున్న పోలీసులు
- విద్యార్థుల ఛాతీపై పిడి గుద్దులు
- విద్యార్థినికి గాయం.. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స
- 26 మంది ఎస్ఎఫ్ఐ నేతల అరెస్టుతో ఉద్రిక్తత

మహారాణిపేట/మద్దిలపాలెం: వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వ విద్యాలయంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోరుతూ విద్యార్థులు కదం తొక్కారు. భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం 'చలో కలెక్టరేట్' కార్యక్రమం చేపట్టారు. ఏయూ ప్రధాన ద్వారం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు వందలాది మంది విద్యార్థులు భారీ ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

నిరసన.. ఘర్షణ.. అరెస్టులు..

ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్న ఏయూ విద్యార్థులు, రోడ్డుపై బైఠాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ర్యాలీకి, ధర్నాకు అనుమతులు లేవని, వెంటనే ఖాళీ చేయాలని పోలీసులు మైక్‌ల్లో హెచ్చరించినా విద్యార్థులు మధ్యాహ్నం 2 గంటల వరకు ఆందోళన కొనసాగించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో విద్యార్థులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం, స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు కలిపి మొత్తం 26 మందిని అరెస్టు చేసి మహారాణిపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఏసీపీ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు

ప్రభుత్వంపై నేతల ఆగ్రహం

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడు మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడాన్ని ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులపై భారం మోపుతోందని విమర్శించారు. ఏయూను గీతం ప్రైవేట్ యూనివర్సిటీకి దాసోహం చేస్తూ 46 పీజీ కోర్సులను ఎత్తివేశారని ఆయన మండిపడ్డారు. ఏయూ కమిటీ కన్వీనర్ డి.వెంకటరమణ మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే మంత్రులు, ఎమ్మెల్యేలను వర్సిటీలో అడుగుపెట్టనివ్వమని, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కూటమి నేతలు ఏయూను తమ రాజకీయాలకు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు.

అరెస్టులను ఖండించిన పరిరక్షణ కమిటీ

విద్యార్థుల అరెస్టులను ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఇది ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. అరెస్టుల సమయంలో పొన్నాడ ప్రగతి అనే ఇంజినీరింగ్ విద్యార్థిని తీవ్రంగా గాయపడి కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఛాతీపై పిడిగుద్దులతో దాడి చేయడాన్ని, 26 మంది నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఖండించింది. ఆందోళనలో ఎస్ఎఫ్ఐ ఏయూ అధ్యక్షురాలు ఎం.కుసుమాంజలి, జిల్లా నాయకులు పి.సాయి తేజ, ఎం.నరేష్ ఎం.శశికుమార్, ఆర్.నిఖిల్, పి.ప్రగతి, వినీల, మౌనిక, బి.భరత్, విద్యార్థులు తరుణ్, సునీల్, సోమేష్, సంజయ్, కౌశల్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రధాన డిమాండ్లు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.6,800 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. పెరిగిన మెస్ బిల్లులకు అనుగుణంగా స్కాలర్‌షిప్‌ను ప్రతి విద్యార్థికి నెలకు రూ.3500కు పెంచాలని, వర్సిటీలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, నాన్-టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, వర్సిటీ హాస్టళ్లకు విద్యుత్ సరఫరాను కమర్షియల్ పరిధి నుంచి డొమెస్టిక్ పరిధిలోకి మార్చాలని, వర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కేటాయించాలన్నారు. మేనేజ్‌మెంట్ కోటాను రద్దు చేసి 100 శాతం సీట్లను కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలని, బకాయిల పేరుతో సర్టిఫికెట్లు నిలిపివేయకుండా, గతంలో లాగా 'నో డ్యూస్' విధానంలో మంజూరు చేయాలని, యూజీసీ నిబంధనల ప్రకారం విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించి క్యాంపస్ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, రాష్ట్రవ్యాప్త కామన్ పీజీ సెట్‌ను రద్దు చేసి, వర్సిటీ పరిధిలోనే పీజీ ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

అధ్వానంగా ఏయూ పరిస్థితులు



మాది రెక్కాడితే గానీ డొక్కాడని పేద రైతు కుటుంబం. మా నాన్న వ్యవసాయ కూలీగా పని చేస్తూ నన్ను చదివిస్తున్నారు. ఉన్నత చదువుతో ప్రయోజకుడిని అవ్వాలన్న ఆశతో ఇక్కడికి వచ్చాను. కానీ ఇక్కడ హాస్టల్, తరగతి గదుల పరిస్థితి అధ్వానంగా ఉంది. మరుగుదొడ్లకు నీళ్లు రావు. దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మరోవైపు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో నా లాంటి ఎందరో విద్యార్థుల సర్టిఫికెట్లను ఆపేశారు. మా బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో ఉన్నాం.

– కృష్ణ, ఏయూ విద్యార్థి

ఆపరేషన్ లంగ్స్‌తో సుందర నగరం

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

డాబాగార్డెన్స్: ఆపరేషన్ లంగ్స్ ద్వారా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, సుందర నగరం దిశగా జీవీఎంసీ చర్యలు చేపట్టిందని కమిషనర్ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. నగరంలో ఇప్పటివరకు 2,470కి పైగా ఆక్రమణలు తొలగించినట్లు పేర్కొన్నారు. వీధి వ్యాపారులను గుర్తించి.. వీధి విక్రయ జోన్లలో కేటాయించేందుకు జీవీఎంసీ ప్రణాళికలు చేపడుతుందన్నారు. గతంలో ఎక్కడ పడితే అక్కడ అనధికారికంగా ఫుడ్‌స్టాళ్లు, ఇతర చిల్లర వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడేవని.. అందుల్లే వాటిని తొలగిస్తున్నట్లు చెప్పారు. ఫుడ్‌స్టాళ్లలో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడతోందని వైద్య నిపుణులు సూచిస్తున్నారన్నారు. ఆహార స్టాళ్లను కట్టడి చేసి, ఆహార భద్రత నిర్ధారించడం, సురక్షిత ఆహారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడమే జీవీఎంసీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

'ఐపీఏ'లో వేణుగోపాల్‌కు పదోన్నతి

టీచ్‌రోడ్డు : విశాఖ పోర్టు అథారిటీ సెక్రటరీగా పనిచేస్తున్న టి. వేణుగోపాల్‌కు ఇండియన్ పోర్ట్స్ అసోసియేషన్ (ఐపీఏ)లో కీలకమైన పదోన్నతి లభించింది. ఆయన ఈడీ (జనరల్)గా నియమితులయ్యారు. ఈ నియామకం మూడేళ్ల కాలానికి లేదా తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు డిప్యూటేషన్‌పై ఉంటుంది. ఐపీఏ గవర్నింగ్ బాడీ 212వ సమావేశంలో ఈ నియామకానికి ఆమోదం లభించింది. ఈ ఉత్తర్వుపై ఐపీఏ మేనేజింగ్ డైరెక్టర్ వికాస్ నర్వాల్ సంతకం చేశారు.

నేటి 'చలో జీవీఎంసీ' విజయవంతం చేయండి

వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపు

సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో బడ్డీలు, తోపుడు బళ్లు, టీ, టిఫెన్ సెంటర్ల తొలగింపునకు తక్షణం నిలిపివేయడంతోపాటు చిరు వ్యాపారులకు శాశ్వత పరిష్కారం చూపాలని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు డిమాండ్ చేశారు. చిరు వ్యాపారులకు మద్దతుగా మంగళవారం 9.30 గంటలకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే 'చలో జీవీఎంసీ' శాంతియుత నిరసనకు పార్టీ శ్రేణులు, బాధితులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు శాంతియుతంగా ర్యాలీ చేపడతామన్నారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. అంతకుముందు ఈ విషయమై జిల్లా వాణిజ్య విభాగం కమిటీ సభ్యులతో కె.కె.రాజు సమావేశం నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ తీరును ఎండగట్టాలన్నారు. సమావేశంలో తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సంకాబత్తుల ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కిరండూల్‌కు అదనపు కోచ్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆయా తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం పాసింజర్‌కు అదనపు కోచ్‌ను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(58501) పాసింజర్‌కు ఈ నెల 23వ తేదీ నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు, కిరండూల్-విశాఖపట్నం(58502) పాసింజర్‌కు ఈ నెల 24వ తేదీ నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

పేదల పొట్ట కొడుతుంటే ఏమి చేస్తున్నావ్?



చిరువ్యాపారులతో మాట్లాడుతున్న వాసుపల్లి



బాధితురాలికి ధైర్యం చెబుతున్న వాసుపల్లి

- వంశీ.. మీ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను నిలదీయలేవా?
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి ఆగ్రహం
- చిరువ్యాపారులతో కలిసి కేజీహెచ్ మెయిన్ గేట్ వద్ద నిరసన



చిరు వ్యాపారులతో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి, వైఎస్సార్ సీపీ నేతలు

డాబాగార్డెన్స్: 'నీ నియోజకవర్గంలో పేదలు నడిరోడ్డున పడ్డారు. ఆపరేషన్ లంగ్స్ పేరిట నిరుపేదల పొట్టలు కొడుతున్నారు. ఉద్యోగాలు, ఉపాధి ప్రభుత్వాలు కల్పించకపోయినా బడ్డీలే జీవనాధారంగా బతుకుతున్నారు. వారి పొట్టలు కొడుతుంటే కనీసం నీలో చలనం లేదా? స్టేట్‌మెంట్ ఇచ్చేస్తే సరిపోతుందా? కూటమిలో మీ పార్టీ భాగస్వామ్యం కాదా? మీ అధినేత పవన్ కల్యాణ్‌ను నిలదీయలేవా?' అంటూ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్.. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌పై మండిపడ్డారు. నియోజకవర్గ పరిధిలో అనేక దుకాణాలు తొలగించారు. తాజాగా కేజీహెచ్ చుట్టూ ఉన్న దుకాణాలు తొలగించేందుకు జీవీఎంసీ సిద్ధం కావడంతో వాసుపల్లి చిరువ్యాపారులకు బాసటగా నిలుస్తూ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్‌తో పాటు పార్టీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. కేజీహెచ్ ఓపీ గేట్ నుంచి మెయిన్ గేట్ వరకు అక్కడి చిరువ్యాపారులతో కలిసి 'ఆపరేషన్ స్టమక్' పేరిట నిరసన ప్రదర్శన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి చిరువ్యాపారులకు మద్దతుగా నిలిచారు. అనంతరం వాసుపల్లి మీడియాతో మాట్లాడుతూ నగరంలో ఇంత పెద్ద ఎత్తున పేదలకు అన్యాయం జరుగుతుంటే కూటమి నేతలు కళ్లు మూసుకొని ఉన్నారే తప్పా.. ఆదుకోవాలనే తపన లేకపోవడం శోచనీయమని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 10 లక్షల మంది స్ట్రీట్ వెండార్స్ ఉన్నారని, వారి ద్వారానే రూ.4లక్షల కోట్ల టర్నోవర్ జరుగుతుందన్నారు. పేదలే సెల్ఫ్ ఎంప్లాయిమెంట్‌తో బతుకుతుంటే అభివృద్ధి పేరిట వారిని తొలగిస్తారా? వారి కడుపులు కొడతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో పేదోడి బడ్డీలు తొలగించలేదు? ఇక్కడ పెద్ద ఎత్తున బడ్డీలు తొలగిస్తుంటే ఎమ్మెల్యే వంశీకృష్ణకు అడ్డుకోవడం చేతకావడం లేదన్నారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ మాట్లాడుతూ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి, కార్పొరేటర్లు స్టడీ టూర్‌కి వెళ్లిన సమయంలో ప్రీ ప్లాన్‌గా బడ్డీల తొలగింపు చేపట్టారన్నారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు అందరూ గుండెపై హాయిగా చేయి వేసుకుని పడుకునేవారు.. ఇప్పుడు గుండెలు బాదుకున్న పరిస్థితి దాపురించిందన్నారు. ఇంత జరుగుతున్నా ఒక్క ప్రజాప్రతినిధి నోరు విప్పకపోవడం శోచనీయమన్నారు. చిరు వ్యాపారులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. పార్టీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ మాట్లాడుతూ కూటమి నాయకులు దోచుకున్న భూములపై కమిషనర్ యాక్షన్ తీసుకోవాలే తప్పా వీధి వ్యాపారులపై కాదన్నారు.

బడ్డీల తొలగింపుతో బతుకులు అంధకారం



న్యాయం చేయాలని నినాదాలు చేస్తున్న బాధిత చిరు వ్యాపారులు

'చలో జీవీఎంసీ' ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి కుమార్

టీచ్‌రోడ్డు : ఎన్నో ఏళ్లుగా బడ్డీలు, తోపుడు బళ్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులపై కూటమి ప్రభుత్వం, జీవీఎంసీ కమిషనర్ అహంకార పూరిత ఏకపక్ష చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ పరిధిలో వీధి విక్రయదారుల బడ్డీలు అక్రమంగా తొలగించడం ఆపి, చిరు వ్యాపారులకు ఉపాధి కల్పించాలని, వీధి విక్రయదారుల రక్షణ చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 'చలో జీవీఎంసీ' పేరుతో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చిరు వ్యాపారులు భారీ నిరసన చేపట్టారు. ఈ మేరకు జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించడం అన్యాయమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చిరు వ్యాపారులకు హ్యాకర్స్ జోన్లు ఏర్పాటు చేసి, స్ట్రీట్ వండర్స్ ఐడెంటి కార్డులు అందజేసి రక్షణ కల్పించాల్సిన కమిషనర్.. ఇలా ఏకపక్షంగా తొలగించడం అహంకారపూరితమన్నారు. తొలగించిన చోటే దుకాణాలు ఏర్పాటు చేసి చిరు వ్యాపారులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తోపుడు బండ్ల వర్తక సంఘం నాయకుల సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ చిరు వ్యాపారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటే యథావిధిగా వ్యాపారాలు చేసుకుంటామని.. లేని పక్షంలో జీవీఎంసీ కార్యాలయం ఎదుటే కుటుంబాలతో సహా నిరసన చేపడతామని హెచ్చరించారు. ఏడీసీ రమణమూర్తి నిరసన వేదిక వద్దకు చేరుకొని చిరు వ్యాపారుల సమస్యలపై వినతి పత్రం తీసుకున్నారు. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇవ్వడం గమనార్హం. కాగా.. నగరంలో సీఎం పర్యటన ఉండడంతో పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, తోపుడు బండ్ల వర్తక సంఘం నాయకులు పడాల రమణ, సింహాచలం, వీధి విక్రయ దారుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిడ్డు వెంకటేశ్వరరావు, కసిరెడ్డి సత్యనారాయణ, పడాల గోవింద్, భీంపల్లి రాము, పిల్లి వీర్రాజు, పద్మరాజు, ఎస్.నాగభూషణం, వందలాది చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్

ఐదుగురికి స్వల్ప గాయాలు



సాయం చేసేందుకు వెళ్లి గాయపడ్డ వ్యక్తులు



ప్రమాదం జరిగిన ఇంట్లో చెల్లా చెదురుగా సామగ్రి



ప్రమాదం చోటు చేసుకున్న గ్రూప్ హౌస్ ఇదే

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లోని ఓ ఇంట్లో జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు ఎవరికీ తీవ్ర గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు, ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి.. విమాన్‌నగర్‌లోని వినాయక ఆలయం సమీపంలో ఉన్న గ్రూప్ హౌస్‌లోని మూడో అంతస్తులో ఆర్మీలో జేఈగా పనిచేస్తున్న మురళి కుటుంబం నివాసం ఉంటోంది. అతని భార్య రాధ సోమవారం ఉదయం పూజ కోసం దూపం వేయడానికి బొగ్గులు రాజేస్తుండగా, ఆ నిప్పు రవ్వలు గాలికి ఎగిరి కిటికీ తెరలకు అంటుకున్నాయి. ఆ మంటలు వాషింగ్ మెషీన్‌కు, ఆ తర్వాత దాని పక్కనే ఉన్న గ్యాస్ సిలిండర్‌కు వ్యాపించాయి. దీంతో భారీ శబ్దంతో సిలిండర్ పేలింది. దీంతో ఆమె ఇంటి నుంచి బయటకు రాగా.. ఈ శబ్దం విన్న పక్కనే ఉన్న వారు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. సిలిండర్‌పై నీళ్లు చల్లడంతో మంటలు వారిపైకి ఎగిసిపడ్డాయి. ఈ క్రమంలో డి.వి.పాత్రుడు, కె.ఎస్.కుమార్, కుమార్ సింగ్‌లతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని వెంటనే కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న మర్రిపాలెం అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే షార్ట్ సర్క్యూట్ కారణంగా వాషింగ్ మెషీన్ పేలిందని, దాని వల్ల పక్కనే ఉన్న నిండు గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగాయని వారు తెలిపారు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్టు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దేశ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి

ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు



రంగోళీ పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

మద్దిలపాలెం: విద్యార్థులు విభిన్న రంగాల్లో ప్రతిభ సాధించాలని ఏయూ జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) సమన్వయకర్త ఆచార్య డి.సింహాచలం అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల యువజనోత్సవాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని తద్వారా వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేయాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విద్యతో సమానంగా కళలు, సాంస్కృతిక, సాహస కృత్యాల్లో చురుకైన భూమిక పోషిస్తారని పేర్కొన్నారు. విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ ఆచార్య ఎస్.హరినాథ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రత్యేకమైన నైపుణ్యాలను, సామర్థ్యాలను కలిగి ఉంటారని, వాటిని గుర్తించి ఆ దిశగా కృషి చేయాలన్నారు.

రెండు రోజులపాటు 11 అంశాలలో యువజనోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. తొలి రోజు వక్తృత్వ, వ్యాసరచన, వాద ప్రతివాద, క్విజ్, రంగవల్లులు, చిత్రలేఖనం విభాగాల్లో పోటీలు జరిగాయి. మంగళవారం సోలో, గ్రూప్ సాంగ్‌లు, శాస్త్రీయ, జానపద నృత్యాలు, నాటికల విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు ఎన్ఎస్ఎస్ దినోత్సవమైన సెప్టెంబర్ 24న బహుమతులు అందించనున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొగ్రాం అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, జోనల్ అధికారి డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, వివిధ జిల్లాల ప్రొగ్రాం అధికారులు పాల్గొన్నారు.

రేపు విజయవాడకు డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు

విశాఖ సిటీ: డీఎస్సీ–2025లో ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీన విశాఖ నుంచి విజయవాడకు బయలుదేరాల్సి ఉంటుందని డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. 25వ తేదీన విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లా నుంచి ఎంపికైన 1,139 అభ్యర్థులు 24 తేదీ ఉదయం 6 గంటల్లోగా ఉక్కునగరంలో ఉన్న విశాఖ విమల విద్యాలయం స్కూల్ వద్ద హాజరుకావాలని సూచించారు. అక్కడ నుంచి బస్సులో విజయవాడకు బయలుదేరాల్సి ఉంటుందన్నారు.

ఒడ్డున ఆగిన బతుకు పడవ

ఆశాజనకంగా లేని వేట



హార్బర్‌లో బోట్లు

సముద్రమే జీవనాధారంగా బతికే గంగపుత్రుల జీవితాలు.. ఇప్పుడు అలల తాకిడికి కొట్టుకుపోతున్నాయి. ఎన్నో ఆశలతో ప్రారంభమైన వేట సీజన్.. వారి ఆశలను ఆవిరి చేస్తూ కన్నీటి గాథగా మారుతోంది. లక్షలు పెట్టుబడిగా పెట్టి సముద్రంలోకి వెళ్తే, కనీసం డీజిల్ ఖర్చులు కూడా రాక, బోట్లను ఒడ్డుకే కట్టేసి నిస్సహాయంగా చూస్తున్నారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ .. ఒకప్పుడు వేలాది బోట్ల రాకపోకలతో, మత్స్యకారుల కోలాహలంతో సందడిగా ఉండేది. కానీ ఇప్పుడు 80 శాతానికి పైగా బోట్లు లంగరేసుకుని నిశ్శబ్దంగా రోదిస్తున్నాయి. – మహారాణిపేట

- తగ్గిన చేపల లభ్యత
- హార్బర్‌కే పరిమితమైన బోట్లు
- వలసపోతున్న మత్స్యకారులు
- ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి

తూర్పు తీరంలో మత్స్యకారుల బతుకు చిత్రం ఆందోళనకరంగా మారింది. వేట సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచినా, వారి వలలకు ఆశించిన సంపద చిక్కడం లేదు. వేటకు వెళ్తే లక్షల్లో ఖర్చు, తిరిగి వస్తే కనీసం పెట్టిన పెట్టుబడి కూడా దక్కని దుస్థితి. దీంతో విశాఖ ఫిషింగ్ హార్బర్‌లోని 643 బోట్లకు గాను కేవలం 150 బోట్లు మాత్రమే నామమాత్రంగా వేటకు వెళ్తున్నాయి. సుమారు 80 శాతానికి పైగా మరబోట్లు ఒడ్డుకే పరిమితమై, అప్రకటిత వేట విరామాన్ని పాటిస్తున్నాయి. ఉపాధి లేక ఎందరో మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలసపోతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

ఆరంభ శూరత్వమే..

విశాఖ చేపల రేవు తూర్పు తీరానికి కేంద్రంగా ఉంది. జూన్ 15న వేట నిషేధం ముగిసినప్పుడు మత్స్యకారులు ఎన్నో ఆశలతో సముద్రంలోకి అడుగుపెట్టారు. తొలి రెండు నెలలు చేపలు, రొయ్యల దిగుబడి జోరుగా సాగడంతో ఈ సీజన్ తమను ఆదుకుంటుందని భావించారు. కానీ ఆగస్టు నుంచి పరిస్థితి తలకిందులైంది. చేపల లభ్యత క్రమంగా తగ్గుతూ వచ్చి, సెప్టెంబర్ నాటికి పూర్తిగా పడిపోయింది. దీంతో వేట గిట్టుబాటు కాక.. యజమానులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. 15 రోజుల వేటకు సుమారు రూ. 3.5 లక్షలు ఖర్చవుతుంటే, కనీస ఆదాయం కూడా రాకపోవడంతో బోట్లను హార్బర్‌లోనే నిలిపివేయడమే శ్రేయస్కరమని భావిస్తున్నారు. కాగా.. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు కోట్లాది రూపాయల విలువ చేసే మత్స్య దిగుబడులు వచ్చాయని మత్స్య పరిశ్రమ వర్గాలు చెబుతుంటే.. సుమారు 40 శాతం మేర తగ్గిపోయాయని వ్యాపారులు అంటున్నారు.

ట్యూనా వేటదీ అదే కథ

అధిక ధర పలికే ట్యూనా చేపల లభ్యత కూడా అంతంతమాత్రంగానే ఉంది. 70 నుంచి 100 వరకు బోట్లు ట్యూనా కోసం వెళ్లినా, ఆశించిన ఫలితం దక్కడం లేదు. నాణ్యమైన గ్రేడ్–1 ట్యూనా చేపలు దొరికినా, వాటిని 48 గంటల్లోపు ఎగుమతి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు విశాఖ హార్బర్‌లో లేవు. దీంతో చేతికొచ్చిన అవకాశాన్ని కూడా జారవిడుచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కాగా.. జిల్లాలో 32 మత్స్యకార గ్రామాలు, సుమారు 1.5 లక్షల జనాభా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పుడు వేట సంక్షోభంలో కూరుకుపోవడంతో వేలాది కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

కారణాలెన్నో.. కష్టాలెన్నో..

మత్స్య సంపద తగ్గడానికి ప్రధాన కారణం సముద్ర వాతావరణంలో వస్తున్న మార్పులేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సముద్ర ఉపరితలం వేడెక్కడంతో చేపలు, రొయ్యలు చల్లదనం కోసం లోతైన ప్రాంతాలకు వెళ్లిపోతున్నాయి. అంత లోతుకు వెళ్లి వేటాడే సాంకేతికత, వనరులు సాధారణ మత్స్యకారులకు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. దీనికి తోడు, పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థాలు సముద్రంలో కలవడం వల్ల కాలుష్యం పెరిగిపోయి, మత్స్య సంపద నశించిపోతోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీజిల్ భారం పెరిగిపోవడంతో వేట గిట్టుబాటు కావడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



ప్రభుత్వం తక్షణమే స్పందించి మత్స్యకారులను ఆదుకోవాలి. పెరిగిన డీజిల్ ధరలు, తగ్గిన వేటతో గంగపుత్రుల బతుకులు కష్టాల్లో ఉన్నాయి. పెట్టుబడి కూడా తిరిగి రాక అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలి.

– వాసుపల్లి జానకీరామ్, వైఎస్సార్ సీపీ నాయకుడు

మత్స్య పరిశ్రమను కాపాడండి



మత్స్య పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉంది. ఇది కేవలం మత్స్యకారుల సమస్య కాదు, మొత్తం పరిశ్రమ భవిష్యత్తు ప్రశ్నార్థకంలో పడింది. గత ఏడాది కూడా ఇదే పరిస్థితి. ప్రభుత్వం దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి సారించి, గిట్టుబాటు ధరలు కల్పించి, పరిశ్రమకు చేయూతనివ్వాలి. లేకపోతే ఈ వృత్తి కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

– సూరాడ సత్యనారాయణ(సత్తిబాబు), ఉపాధ్యక్షులు, వైశాఖి మరపడవల సంఘం

కార్మికులే రైల్వేకు బలం

ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్‌వాల్



మాట్లాడుతున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్‌వాల్



హాజరైన ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ కేంద్ర కార్యవర్గ సభ్యులు, బ్రాంచ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు

తాటిచెట్లపాలెం : ఉద్యోగులు, కార్మికులే భారతీయ రైల్వేకు బలమని ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్ తెలిపారు. సోమవారం తాటిచెట్లపాలెంలో గల ఆశీర్వాద్ కల్యాణ మండపంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ 11వ ద్వివార్షిక సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో నిత్య శ్రామికులు ఒక్క రైల్వే కార్మికులు మాత్రమేనని తెలిపారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ కార్మికుల పక్షాన పలు సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చిందని, త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం లలిత్‌బోహ్రా మాట్లాడుతూ రైల్వే కార్మికులంతా కలిసి పనిచేస్తూ, దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రతీ అడుగులోనూ కార్మికుల పాత్ర ఎంతో ఉందని ప్రశంసించారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే(ఎన్ఎఫ్ఐఆర్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య మాట్లాడుతూ కార్మికులు సరిగా పనిచేయకపోతే అధికారులు వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని, మరి యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఎటువంటి చర్యలు లేవని వాపోయారు. వెంటనే 8వ వేతన సంఘం ఏర్పాటుచేసి 2026 జనవరి నుంచి తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పాత పెన్షన్ స్కీమ్‌ను ప్రతీ రైల్వే కార్మికుడికి అమలుచేయాలని, పాత డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ముందుగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జోనల్ ప్రెసిడెంట్ జి.సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్.సి.సాహూలు కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా అపరిష్కృతంగా ఉన్న రన్నింగ్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే పీసీపీవో ఎల్‌వీఎస్ఎస్ పాత్రుడు, సీనియర్ డీపీవో జూసుఫ్ కబీర్ అన్సారి, ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహూ, ఈ.శాంతరాం, సీనియర్ డీఎంఈ, సీనియర్ డీఎస్‌టీఈ, ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్, వాల్తేర్ డివిజన్, డివిజనల్ కో ఆర్డినేటర్ టి.వి.మాహేశ్వర్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.నరసింగరావు, వాల్తేర్, ఖుర్దా రోడ్, సంబల్‌పూర్ డివిజన్ల నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు, కేంద్ర కార్యవర్గ సభ్యులు, బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు శాప్ కార్మికుడు దుర్మరణం



సూర్యప్రకాష్ మృతదేహం

పీఎం పాలెం: కొమ్మాదిలో గల శాప్(ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్)లో పనిచేస్తున్న దోహర్తి సూర్యప్రకాష్(38) పిడుగుపాటుకు గురై మరణించాడు. సోమవారం ఉదయం చోటు చేసుకున్న ఈ దుర్ఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలు.. సూర్యప్రకాష్ ఆరిలోవలో భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తూ కొమ్మాది ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆఫీస్ సబార్డినేట్, గ్రౌండ్ మెయింటెనెన్స్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 9 గంటలకు గ్రౌండ్‌కు వెళ్లిన అతడు మెషీన్‌తో గ్రాస్ కట్ చేస్తుండగా 11.10 సమయంలో పెద్ద శబ్దంతో పిడుగు పడింది. ఆ ధాటికి సూర్యప్రకాష్ గ్రౌండ్‌లో పడిపోయాడు. శరీరంపై పలు చోట్ల గాయాలయ్యాయి. అక్కడ ఉన్నవారు 108 వాహనానికి ఫోన్ చేశారు. వారు వచ్చి పరిశీలించి మరణించినట్లు ధ్రువీకరించారు. మృతుని భార్యకు, పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. భార్య ఆశ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ మాజీ సీఎండీ బి.ఎన్.సింగ్‌కు ఘన నివాళి



డాక్టర్ బి.ఎన్. సింగ్ మృతికి మౌనం పాటిస్తూ సంతాపం తెలుపుతున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ, డైరెక్టర్లు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పూర్వ సీఎండీ డాక్టర్ బి.ఎన్.సింగ్‌కు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఘనంగా నివాళి అర్పించింది. సోమవారం ఉక్కు పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో బి.ఎన్.సింగ్ మృతికి ఇన్‌చార్జ్ సీఎండీ అజిత్‌కుమార్ సక్సేనా, డైరెక్టర్లు ఎ.కె.బాగ్చీ, ఎస్.సి.పాండే, జి.వి.ఎస్.ప్రసాద్, సలీం జి.పురుషోత్తమ్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ కరుణ రాజు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎన్ సింగ్ తన నాయకత్వంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దేశంలోనే విలువైన ఉక్కు సంస్థగా తీర్చిదిద్దారన్నారు. రూ.4 వేలు కోట్ల నష్టంతో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను తన నాయకత్వ లక్షణాలతో 2002లో టర్న్ అరౌండ్ స్థాయికి తీసుకు వెళ్లారన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో చేరకముందు ఆయన టిస్కో, సెయిల్, రూర్కెలా స్టీల్‌ప్లాంట్‌లో కీలక బాధ్యతలు నిర్వహించారన్నారు. రిటైర్ అయిన తర్వాత కూడా ఆయన ఉక్కు పరిశ్రమలో సెలక్షన్ కమిటీ, సలహాదారుగా బాధ్యతలు నిర్వహించారన్నారు. ఆయన స్టీల్‌ప్లాంట్‌కు చేసిన సేవలను ఉద్యోగులు తమ గుండెల్లో శాశ్వతంగా నిలుపుకుంటారన్నారు.

వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రస్ట్ లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: 'వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రస్ట్' విశాఖపట్నం లోగోను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్న నగర క్రీడాకారుల సహాయార్థం 'ప్రత్యేక క్రీడా సంక్షేమ నిధి' కోసం నూతనంగా ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపక మేనేజింగ్ ట్రస్టీ కమల్ బయిద్ సీపీకి వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిరుపేద క్రీడాకారులకు సామాజిక సేవా సంస్థలు ఆర్థిక సాయాన్ని అందించి ప్రోత్సహించి క్రీడాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ ట్రస్ట్‌ను ప్రారంభించిన కమల్ బయిద్‌తో పాటు ట్రస్టీలు నందూరి రామకృష్ణ , శుభోద్ కుమార్ రాకేచ, డా.మంగ వరప్రసాద్, చింతలపాటి శ్రీనివాసరాజు, కపిల్ అగర్వాల్‌లను సీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎల్.సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ.24.06 లక్షలు

కంచరపాలెం: జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ ఆలయ హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కింపు నిర్వహించారు. 68 రోజులకు గాను రూ.24,06,615లు వచ్చినట్లు ఈవో సురేష్‌బాబా తెలిపారు. దేవదాయ శాఖ తరఫున కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం, సీనియర్ సహాయకులు ప్రభ పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

విశాఖ రైల్వేస్టేషన్‌లో జీఎం తనిఖీలు



ఎండీటీసీలో సూపర్‌వైజర్స్, ఫీల్డ్‌స్టాఫ్‌తో ముఖాముఖి మాట్లాడుతున్న జీఎం

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్(జీఎం) పరమేశ్వర్ ఫంక్‌వాల్, వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం లలిత్ బోహ్రాతో కలిసి విశాఖపట్నం స్టేషన్‌లో పర్యటించారు. ప్రయాణికులకు అందుబాటులో ఉన్న సదుపాయాలను, పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. రిజర్వేషన్ కార్యాలయం, జనరల్ బుకింగ్ కార్యాలయం, క్యాప్సూల్ హోటల్, కేటరింగ్ స్టాల్స్‌ను తనిఖీ చేశారు. ప్లాట్‌ఫాంలు, పాదచారుల వంతెనలను పరిశీలించారు. ఎస్ఎంవీటీ బెంగళూరు–హతియా ఎక్స్‌ప్రెస్‌లో ఆన్‌బోర్డ్ తనిఖీలు చేపట్టారు. అనంతరం మర్రిపాలెంలోని మల్టీ డిసిప్లినరీ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించి, అక్కడ శిక్షణ పొందుతున్న వారితో, ఫీల్డ్ సిబ్బంది, సూపర్‌వైజర్స్‌తో ముఖాముఖి మాట్లాడారు. డీజిల్ లోకోషెడ్‌లో పర్యటించిన జీఎం అక్కడి సిబ్బంది చేపట్టిన నూతన ఆవిష్కరణలను పరిశీలించి, అభినందించారు. న్యూకోచింగ్ కాంప్లెక్స్, ప్యాంట్రీ కార్‌లను కూడా ఆయన తనిఖీ చేశారు. ఈ పర్యటనలో ఆయన వెంట వాల్తేర్ డివిజన్ ఉన్నతాధికారులు ఉన్నారు.

ఉన్నత విద్యకు మరింత ప్రోత్సాహం

కనకమహాలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాంబాబు



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు

అల్లిపురం: అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 సందర్భంగా, ది కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్, జిల్లా సహకార శాఖ సంయుక్తంగా రామ్‌నగర్‌లోని పైడా కాలేజీలో సోమవారం బ్యాంకింగ్‌పై అవగాహన సదస్సును నిర్వహించాయి. సదస్సులో భాగంగా బ్యాంకులు అందించే వివిధ సేవలు, పొదుపు ఖాతాల నిర్వహణ, ముఖ్యంగా విద్యా రుణాలపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ ఖాతాదారులకు అందిస్తున్న విభిన్న సేవలు, రుణాలు, ఇతర సౌకర్యాలను వివరించారు. ఉన్నత చదువులను అభ్యసించాలనుకునే విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమ బ్యాంకు ప్రత్యేక విద్యా రుణాలను అందిస్తోందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పైడా విద్యా సంస్థల చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, సహకార శాఖ జిల్లా అధికారి సత్యశ్రీ, ప్రిన్సిపాల్ డాక్టర్ సరోజిని, కనకమహాలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్యామ్‌కిశోర్, ఇతర బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

వేధింపులు ఆపి.. ఉద్యోగ భద్రత కల్పించాలి

మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూల్ శానిటేషన్ వర్కర్ల ధర్నా



నిరసన చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూల్ శానిటేషన్ వర్కర్లు

బీచ్‌రోడ్డు : మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూల్ శానిటేషన్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గునూరు వరలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో కార్మికులపై టీడీపీ నాయకులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ల వేధింపులు తీవ్రమయ్యాయని.. అకారణంగా తొలగిస్తూ.. ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మనాభం మండలంలో అక్షయపాత్రకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఇవ్వొద్దని కోరారు. కార్మికులకు హామీ ఇచ్చిన విధంగా గ్యాస్ సరఫరా చేయాలని, రెండు నెలల బకాయి బిల్లులను చెల్లించాలని, మెనూ చార్జీలను విద్యార్థికి రూ.20 చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు భవాని, జి.మంగశ్రీ, యూనియన్ నాయకులు పి.మణి, రాము, గౌరీ, నర్సియమ్మ, ధనలక్ష్మి, సావిత్రి పాల్గొన్నారు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



డీఆర్వోకు వినతి పత్రం సమర్పిస్తున్న విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు

మహారాణిపేట : ఉద్యోగుల సమస్యలపై ఆందోళన ఉధృతం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి రీజనల్ అధ్యక్షుడు ఎ.నూకరాజు అన్నారు. సోమవారం డీఆర్వో భవాని శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగుల సమస్యలపై 10 నెలలుగా విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు, ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు సమర్పించామన్నారు. అయినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోయిందన్నారు.